సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 9 । మార్చి । 2023



టమాట కిలో రూ.18

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.18, కనిష్టంగా రూ.4.50, సరాసరిన రూ.8.50 పలికింది.



చీనీ టన్ను రూ.35,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.35,500 పలికాయి. మార్కెట్‌కు 432 టన్నులు అమ్మకానికి వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
37.2°/14.1°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చాలా ప్రాంతాల్లో చలి తీవ్రత కొనసాగింది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

జలం.. పుష్కలం

ఉమ్మడి అనంతపురం జిల్లా ఒకప్పుడు తీవ్ర వర్షాభావం ఎదుర్కొన్న ప్రాంతం. కానీ మూడేళ్లుగా పరిస్థితి మారింది. వరుణుడు కరుణించడంతో ఎటు చూసినా జలమే... వాగులు, వంకలు, నదుల్లో నీరు పారుతోంది. రిజర్వాయర్లలో నీరు పుష్కలంగా కనిపిస్తోంది. ప్రభుత్వం కూడా ఉపాధి కింద 'అమృత్ సరోవర్' పథకం ద్వారా చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టి నీటి నిల్వ సామర్థ్యం పెంచింది. దీంతో భూగర్భ జలమట్టం కూడా పైపైకి ఎగబాకింది. ఫలితంగా ఈ వేసవిలో తాగు, సాగునీటి ఇబ్బందులు తీరాయి. గతంలో బీళ్లుగా ఉన్న భూములన్నీ పంటలతో కళకళలాడుతున్నాయి.

- విస్తారంగా వర్షాలతో పారిన నదులు
- 'అమృత్ సరోవర్' పనులతో చెరువుల్లో పెరిగిన నిల్వ సామర్థ్యం
- భారీగా పెరిగిన భూగర్భ జలాలు.. తప్పిన వేసవి తిప్పలు
- రబీలో రికార్డు స్థాయిలో సాగులోకి వచ్చిన పంటలు
- జిల్లాలో వాల్టా పరిధిలోని 52 గ్రామాలకు విముక్తి

సాక్షి, పుట్టపర్తి/పుట్టపర్తి అర్బన్: వరుణుడి కరుణతో చెరువులన్నీ నిండుకుండలను తలపిస్తున్నాయి. పచ్చని పంటలతో జిల్లా కళకళలాడుతోంది. జూన్ 1 నుంచి ఇప్పటివరకు 528.7 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా, జనవరి నాటికి 789.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఫలితంగా భూగర్భ జలమట్టం బాగా పెరగడంతో తాగు, సాగునీటి కష్టాలు తప్పాయి.



మరువ పారుతున్న బుక్కపట్నం చెరువు

ముమ్మరంగా 'అమృత్' పనులు..



ప్రతి నీటిబొట్టునూ ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెంపొందించేందుకు ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 'అమృత్ సరోవర్' పనులు ముమ్మరం చేసింది. చెరువుల్లో పూడికతీతతో పూర్వ వైభవం తెస్తోంది. అధికారులూ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయడంతో అమృత్ సరోవర్ పనుల్లో రాష్ట్రంలోనే జిల్లా మూడో స్థానంలో నిలిచింది. ఫలితంగా పనులు పూర్తయిన చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరిగింది.

స్థానికంగా 'ఉపాధి'..

'అమృత్ సరోవర్' పనులతో కూలీలకు స్థానికంగా ఉపాధి లభిస్తోంది. వేసవి కాలంలో సుదూర ప్రాంతాలకు వెళ్లే సమస్య లేకుండా గ్రామ పరిధిలోనే పనులు ఉంటున్నాయి. అంతేకాకుండా సకాలంలో బిల్లులు పడుతుండటంతో కూలీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అమృత్ సరోవర్ పనుల్లో భాగంగా చాలా చోట్ల చెరువు పూడికతీత పనులు చేపట్టారు.

పెరిగిన భూగర్భ జలాలు..

నదులు, కుంటలు, వాగులు పారుతుండటం, అమృత్ సరోవర్ కింద చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టడంతో భూగర్భజలమట్టం పెరిగింది. దీంతో గతంతో పోల్చితే ఈసారి పాతాళ గంగ మరింత పైకి వచ్చింది. గతేడాది 12 మీటర్ల లోతులో ఉన్న పాతాళ గంగ ఈసారి ఆరు మీటర్ల పైకి ఎగబాకింది. కొన్ని ప్రాంతాల్లో నాలుగు మీటర్ల లోనే నీళ్లు అందుబాటులో ఉండటం విశేషం. జిల్లాలో భూగర్భ జలాలు పెరగడంలో వాల్టా పరిధిలో ఉన్న 52 గ్రామాలకు విముక్తి లభించింది. నిషేధిత జాబితా నుంచి ఆయా గ్రామాలను తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

528.7 మి.మీ	జూన్1 నుంచి ఇప్పటివరకూ కురవాల్సిన వర్షం
789.6 మి.మీ	జనవరి నాటికి జిల్లాలో కురిసిన వర్షం
31,796 హెక్టార్లు	రబీ సాధారణ సాగు విస్తీర్ణం
37,567 హెక్టార్లు	ప్రస్తుతం జిల్లాలో వివిధ పంటల సాగు విస్తీర్ణం
110	జిల్లాలో చేపట్టిన 'అమృత్ సరోవర్' పనుల సంఖ్య

పెరిగిన రబీ సాగు విస్తీర్ణం..



జిల్లాలో రబీ సాధారణ సాగు విస్తీర్ణం 31,796 హెక్టార్లు కాగా, ఈసారి సాగునీటి ఇబ్బందులు లేక పోవడంతో రైతులంతా భూములు సాగు చేశారు. అందువల్లే ప్రస్తుత సీజన్‌లో ఏకంగా 37,567 హెక్టార్లలో పంటలు సాగులోకి వచ్చాయి. ఇందులో వేరుశనగ 20,554 హెక్టార్లు, మొక్కజొన్న 6,125 హెక్టార్లు, వరి 2,176 హెక్టార్లు, శనగలు 1,786 హెక్టార్లు, రాగి 705 హెక్టార్లు, ఉలవలు 588 హెక్టార్లు, పొద్దు తిరుగుడు పంట 660 హెక్టార్లతో పాటు మిగతా విస్తీర్ణంతో వివిధ రకాల పంటలు సాగులో ఉన్నాయి.

మూడేళ్లుగా చిత్రావతి పారుతోంది



మా గ్రామం మీదుగా ప్రవహించే చిత్రావతి మూడేళ్లుగా ప్రవహిస్తోంది. గ్రామంలోని చెక్‌డ్యాం నిండుకుండలా మారగా, వందలాది బోర్లు రీచార్జ్ అయ్యాయి. సాగునీటి ఇబ్బందులు లేకపోవడంతో పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. చిత్రావతితో పాటు చెరువులన్నీ ఇప్పటికీ మరువ పారుతున్నాయి.
– ఎస్.బాషు పెదపల్లి, పుట్టపర్తి మండలం

సమృద్ధిగా నీటి వనరులు



మూడేళ్ల నుంచి వర్షాలు విస్తారంగా కురవడం, చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టడంతో భూగర్భ జలాలు పెరగాయి. దీంతో జిల్లాలో నీటి వనరులు సమృద్ధిగా ఉన్నాయి. గతంలో వాల్టా పరిధిలోని 98 గ్రామాలుండగా, 52 గ్రామాలను వాల్టా పరిధిలోంచి తొలగించాం.
– రాజశేఖరరెడ్డి, జలవనరుల శాఖ జిల్లా అధికారి

ఆగస్టు నాటికి పూర్తి చేస్తాం



జిల్లా వ్యాప్తంగా అమృత్ సరోవర్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. కూలీలకు అన్ని రకాల వసతులు అందుబాటులో ఉన్నాయి. సకాలంలో బిల్లులు ఖాతాల్లో జమ అవుతున్నాయి. ఆగస్టు నాటికి లక్ష్యం పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తాం.
– రామాంజనేయులు, డ్వామా పీడీ

న్యూస్‌రీల్

బుద్ధం శరణం గచ్ఛామి



నాటికలో ఓ సన్నివేశం

ప్రశాంతి నిలయం: హోలీ పర్వదినం సందర్భంగా ప్రశాంతి నిలయంలో బుధవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. బిహార్ రాష్ట్రానికి చెందిన వేలాది మంది భక్తులు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత వేదపఠనంతో వేడుకలు ప్రారంభంకాగా, బిహార్ సత్యసాయి బాలవికాస్ చిన్నారుల 'భగవాన్ బుద్ధ' పేరుతో నాటిక ప్రదర్శించారు. బుద్ధుని బాల్యం, జీవిత ఘట్టాలు, బోధనలను వివరిస్తూ తమ అద్భుత నటనతో ఆకట్టుకున్నారు. బుద్ధం శరణం గచ్ఛామి గురించి వివరించారు. అనంతరం నిర్వహించిన సంగీత కచేరీ ఆహూతులను అలరించింది.

జంబో బ్యాలెట్ పెట్టెలు వచ్చేశాయ్



జంబో బ్యాలెట్ పెట్టెలు

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ఈ నెల 13న జరగనుంది. ప్రత్యేక పరిస్థితుల్లో ఓటింగ్ కోసం వినియోగించే జంబో బ్యాలెట్ పెట్టెలు బుధవారం అనంతపురానికి చేరాయి. ప్రస్తుతం జరగనున్న ఎన్నికల్లో పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానం నుంచి 49 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ క్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ బ్యాలెట్ పేపర్ సైజ్ పెద్దగా ఉంటుంది. ఓటింగ్ కోసం మామూలు బ్యాలెట్ పెట్టెలు వినియోగించడం ద్వారా సమస్య ఉన్నట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు. ప్రధానంగా ఓటరు బ్యాలెట్ పేపర్‌ను పెట్టెలో వేసే క్రమంలో ఇబ్బంది పడాల్సి వస్తుందని గుర్తించారు. దీంతో తెలంగాణ రాష్ట్ర నల్లగొండ నుంచి ప్రత్యేకంగా రెండు వాహనాల్లో 146 జంబో బ్యాలెట్ పెట్టెలను తెప్పించారు. కలెక్టరేట్‌కు వచ్చిన వీటిని జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు తరలించారు.

మొక్కజొన్న సాగుపై రైతుల ఆసక్తి



అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లా రైతులు మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. తక్కువ పెట్టుబడి, అధిక దిగుబడి, శ్రమ తక్కువ, గిట్టుబాటు ధర లభిస్తుండడంతో ఉమ్మడి జిల్లా అంతటా మొక్కజొన్న సాగు విస్తరిస్తోంది. మొక్కజొన్న ఎక్కువగా హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు, గోరంట్ల తదితర ప్రాంతాల్లోనే మొదటి నుంచి సాగవుతూ వస్తోంది. అయితే ఈ రబీలో అనంతపురం జిల్లా రైతులు కూడా మొక్కజొన్నపై ఆసక్తి చూపించారు. ఈ సీజన్‌లో 4,413 హెక్టార్లు అంచనా వేయగా... 237 శాతంతో 11,823 హెక్టార్లలో సాగైనట్లు ఈ-క్రాప్ నివేదిక స్పష్టం చేస్తోంది. రబీలో ప్రధానపంటగా ఉన్న పప్పుశనగ 80,362 హెక్టార్లకు అంచనా వేయగా 77 శాతంతో 61,913 హెక్టార్లలో సాగైంది. మరో ప్రధానపంట వేరుశనగ సాధారణ సాగు 18,909 హెక్టార్లు కాగా 101 శాతంతో 19,087 హెక్టార్లలో సాగైంది.

బైక్ అదుపుతప్పి ఏఆర్ కానిస్టేబుల్ మృతి



మల్లికార్జున నాయుడు (ఫైల్)

తనకల్లు: బైక్ అదుపు తప్పి చెట్టును ఢీ కొన్న ఘటనలో ఏఆర్ కానిస్టేబుల్ మృత్యువాత పడ్డాడు. ఎస్‌ఐ రాంభూపాల్ తెలిపిన వివరాల మేరకు...మండల పరిధిలోని తోడేళ్లగడ్డపల్లికి చెందిన మల్లికార్జున నాయుడు (35) ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొన్నిరోజులుగా కదిరి లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల బందోబస్తు విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం స్వగ్రామానికి వచ్చాడు. నూతనంగా నిర్మిస్తున్న ఇంటికి కావాల్సిన సామగ్రిని కొక్కంటిక్రాస్‌లోని ఓ దుకాణంలో కొనుగోలు చేసి గ్రామానికి పంపించాడు. అనంతరం తిరిగి విధుల నిర్వహణ కోసం తన ద్విచక్ర వాహనంలో కదిరికి బయలుదేరాడు. అయితే సాయిబాబా గుడి దాటిన తర్వాత అతను ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి జాతీయ రహదారి పక్కనే ఉన్న చెట్టును ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మల్లికార్జుననాయుడు అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే అతన్ని స్థానిక 30 పడకల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మల్లికార్జున నాయుడు మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బత్తలపల్లి: జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు బత్తలపల్లిలోని పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక పాఠశాలలో 80 సీట్లను భర్తీ చేయనున్నారు. 9 నుంచి 11 ఏళ్ల మధ్య వయసున్న బీసీ, ఈబీసీ వర్గాల పిల్లలు, 9 నుంచి 13ఏళ్ల లోపు వయసున్న ఎస్సీ, ఎస్టీ వర్గాల పిల్లలు అర్హులు. కుటుంబ వార్షికాదాయం రూ.లక్ష లోపు ఉండాలి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏదైనా పాఠశాలలో రెండేళ్ల విద్యాభ్యాసంతో పాటు 4వ తరగతి పూర్తి చేసి ఉండాలి. రూ.100 రుసుం చెల్లించి దరఖాస్తులను ఏప్రిల్ 4వ తేదీ లోపు https:// mjpapbcwreis. apcfss. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. కాగా, ఈ ఏడాది ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేయనున్నారు.

వైఎస్ జగన్‌తోనే మహిళా సాధికారత



పెనుకొండ: కేక్ కట్ చేయిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



రివార్డులు అందుకున్న మహిళా ఉద్యోగులతో డీపీటీఓ మధుసూదన్ తదితరులు

- మహిళల ఆత్మగౌరవాన్ని పెంచిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల శంకరనారాయణ

పెనుకొండ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన చర్యలతో రాష్ట్రంలో మహిళల ఆత్మగౌరవం మరింత పెరిగిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం పెనుకొండలోని తన క్యాంప్ కార్యాలయంలో తన సతీమణి జయలక్ష్మమ్మతో కలసి ఆయన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మాట్లాడారు. దేశ చరిత్రలో తొలిసారిగా మహిళాసాధికారత జగన్ సర్కార్‌తోనే సాధ్యమైందన్నారు. దిశ చట్టం అమలుతో మహిళల ఆత్మగౌరవాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరింత పెంచారన్నారు. ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళలకే దక్కేలా చేసి, వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేశారన్నారు. జగనన్న పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ ఉమర్ ఫారూక్ ఖాన్, వైస్ చైర్మన్ సునీల్, సర్పంచ్ గౌతమి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ బోయ నరసింహ, మండల కన్వీనర్ నాగలూరుబాబు, ముఖ్య నాయకులు జయశంకరరెడ్డి, నేమతుల్లా, సద్దాం, శ్రీకాంత్‌రెడ్డి, నాగమూర్తి, కొండలరాయుడు, రామాంజినేయులు, భాస్కర్‌నాయక్, నారాయణస్వామి, నరసింహప్ప, శంకరరెడ్డి, నాయుడు, బోయబాబు, యాసిన్, ఫరీద్, తిమ్మారెడ్డి, ఫర్జియాభాను, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుండాలి..

పుట్టపర్తి టౌన్: ఆర్థిక, సామాజిక, రాజకీయ తదితర అన్ని రంగాల్లో మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తున్న క్రమంలో ఆయా రంగాలను అందిపుచుకుని సమాజాభివృద్ధికి పాటుపడాలని మహిళలకు కలెక్టరేట్ తహసీల్దార్ అనుపమ, ప్రముఖ గైనకాలజిస్ట్ విజయలక్ష్మి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం పుట్టపర్తిలోని ఏపీపీటీడీ (ఆర్టీసీ) కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. అనంతరం జిల్లాలోని ఆరు డిపోల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన మహిళా కండక్టర్లకు రివార్డులు అందజేసి, సత్కరించారు. ముఖ్య అతిథులుగా తహసీల్దార్ అనుపమ, గైనకాలజిస్ట్ విజయలక్ష్మి, డీపీటీఓ మధుసూదన్ హాజరై, మాట్లాడారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తూ తాము ఎందులోనూ తీసిపోమని చాటుతున్నారన్నారు. సృష్టికి మూలమైన మహిళను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కుటుంబ జీవనంలో మహిళలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం ఎన్నో చట్టాలను అమలు చేస్తోందని, వాటి గురించి మహిళలు తెలుసుకోవాలన్నారు. కదిరి డిపో అసిస్టెంట్ మేనేజర్ హరిత, పుట్టపర్తి డిపో మేనేజర్ ఇనాయతుల్లా, హెడ్ క్లర్క్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో నిబంధనలన్నీ పాటించాలి

- మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పక్కాగా పాటించాలి
- ఎన్నికల పరిశీలకులు హరిజవహర్‌లాల్, డాక్టర్ పోలా భాస్కర్



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు

పుట్టపర్తి అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ (ఈసీ) ఆదేశాలు పాటించాలని ఎన్నికల పరిశీలకులు ఎం.హరి జవహర్‌లాల్(ఉపాధ్యాయ నియోజక వర్గం), డాక్టర్ పోలా భాస్కర్(పట్టభద్రుల నియోజక వర్గం)ఆదేశించారు. బుధవారం వారు కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సన్నద్ధతపై జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా హరి జవహర్‌లాల్ మాట్లాడుతూ... ఈనెల 13వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ సజావుగా సాగేలా చూడాలన్నారు. ఎన్నికల సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ సొంత నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను అమలు చేయాలన్నారు. వేసవి దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు అందుబాటులో ఉంచాలని, వైద్య సేవలు అందుబాటులో ఉంచాలన్నారు. వెబ్‌క్యాస్టింగ్‌కు ఇబ్బంది లేకుండా కెమెరాలు బిగించాలన్నారు. ఎన్నికలను మానిటరింగ్ చేసేందుకు కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలన్నారు. పట్టభద్రుల నియోజక వర్గ ఎన్నికల పరిశీలకుడు డాక్టర్ పోలా భాస్కర్ మాట్లాడుతూ... ఓటరు స్లిప్పుల పంపిణీ, అధికారులకు శిక్షణ, మెటీరియల్ పంపిణీ, ట్రాన్స్‌పోర్ట్ వెబ్‌క్యాస్టింగ్, వీడియోగ్రఫీ తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు.

సమన్వయంతో పనిచేయాలి..

జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడుతూ...జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేసి ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా జరిగేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై నోడల్ అధికారులు దృష్టి సారించాలన్నారు. ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ మాట్లాడుతూ... సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలను, బందోబస్తు వివరాలను వివరించారు.

జిల్లాలో 86 పోలింగ్ కేంద్రాలు..

డీఆర్‌ఓ కొండయ్య మాట్లాడుతూ, పట్టభద్రుల నియోజక వర్గానికి సంబంధించి జిల్లాలో 43,310 మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 3,348 మంది ఓటర్లు ఉన్నారని, వారి కోసం జిల్లాలోని 86 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. ఇప్పటికే పీఓలు, 108 ఏపీఓలు, 108 మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ ఇచ్చామన్నారు. సమావేశంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, సీపీఓ విజయ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ రామాంజనేయులు, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, ఆర్డీఓలు తిప్పేనాయక్, రాఘవేంద్ర, ఏఎస్పీ రామకృష్ణప్రసాద్, డీసీఓ కృష్ణానాయక్ పాల్గొన్నారు.

శేషవాహనంపై ప్రహ్లాద వరదుడు



కదిరి: ఖాద్రీశుని బ్రహ్మోత్సవాలు కమనీయంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఖాద్రీ లక్ష్మీ నారసింహుడు శేష వాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత అర్చకులు శ్రీవారిని బంగారు, వజ్ర, వైఢూర్య, మరకత, మాణిక్య, పట్టు పీతాంబరాలతో విశేషంగా అలంకరించారు. రాత్రి 9 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేతంగా శేషవాహనంపై కొలువుదీర్చారు. ప్రతి ఉత్సవంలోనూ ఒక్కరే దర్శనమిచ్చే స్వామివారు... శేషవాహనంపై మాత్రం శ్రీదేవి, భూదేవి సమేతంగా కనిపించడంతో భక్తులు స్వామివారి దివ్య మంగళరూపాన్ని దర్శించుకుని తన్మయత్వం చెందారు. లక్ష్మీ నారసింహునికి సేవ చేయడానికి సాక్షాత్తు ఆదిశేషుడే వాహనంగా విచ్చేశారని అర్చక పండితులు వివరించారు. అంతకుముందు యాగశాల ప్రవేశం, నిత్య హోమాలు నిర్వహించి స్వామి వారిని సుగంధ ద్రవ్యాలతో అలంకరించారు. ఆచార్య రుత్వికులను ఆలయ మర్యాదలతో అర్చకులు ఆహ్వానించారు. శేష వాహన ఉభయదారులుగా యాదాలం శ్రీనివాసులు, బాలాజీ కుటుంబ సభ్యులు వ్యవహరించారని ఆలయ ఈఓ గురుప్రసాద్ తెలిపారు.



తిరువీధుల్లో కోలాటం ఆడుతున్న మహిళలు

నేడు సూర్య, చంద్ర ప్రభ..

లోకంలో పుట్టడం, జీవించడం, మరణించడం అనే మూడు ప్రక్రియలు కాలాధీనాలు. ఆ కాల స్వరూపుడిని తానేనంటూ భక్తులకు చాటి చెప్పేందుకు ఖాద్రీ లక్ష్మీ నారసింహుడు గురువారం పగలు సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

క్లుప్తంగా

పెద్దారెడ్డితోనే తాడిపత్రిలో శాంతి

పెద్దవప్పూరు: ఫ్యాక్షన్ ప్రభావితమైన తాడిపత్రి నియోజకవర్గంలో శాంతి కుసుమాలు విరబూస్తున్నాయంటే అందుకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన చర్యలేనని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. పెద్దపప్పూరు మండలం చిక్కేపల్లి వద్ద కొనసాగుతున్న పెద్దారెడ్డి పాదయాత్రకు బుధవారం ఆయన సంఘీభావం తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు నామనాంకపల్లి వరకూ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గతానికంటే భిన్నంగా కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతోందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిని గెలిపించాలని కోరారు.

మూత్రపిండాలకు ముప్పు



శరీరంలోని మలినాలను బయటకు పంపడంలో కిడ్నీలది కీలక పాత్ర. అయితే జీవనశైలిలో మార్పులతో పాటు ఆహార నియమాలు పాటించకపోవడం వల్ల కిడ్నీలు పాడయ్యే ప్రమాదం ఉంది. కిడ్నీలు పూర్తిగా పాడైతే ప్రాణాలు దక్కకుండా పోతాయి. ప్రాథమిక దశలోనే కిడ్నీల సమస్యను గుర్తించి సరైన చికిత్స తీసుకోవాలి. మూత్రపిండాలకు ముప్పు వాటిల్లకముందే ప్రజలు మేల్కొని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- తస్మాత్ జాగ్రత్త..! • ఇష్టారాజ్యంగా తిండి తగదు
- ఆహారంలో స్వీయ నియంత్రణ లేకే కిడ్నీ సమస్యలు
- కిడ్నీలపై ప్రభావం చూపుతున్న బీపీ, షుగర్
- ఉమ్మడి జిల్లాలో 40 ఏళ్లకే డయాలసిస్ చేసుకుంటున్న వారెందరో..

సందర్భం
నేడు అంతర్జాతీయ కిడ్నీ పరిరక్షణ దినోత్సవం

సాక్షి ప్రతినిధి, అనంతపురం : చిన్న వయసులోనే గుండె పోటు మరణాలు కలవర పరుస్తున్నాయి. అదే స్థాయిలో మూత్రపిండ(కిడ్నీ) వ్యాధుల భయమూ వెంటాడుతోంది. శరీరంలో అత్యంత కీలకమైన అవయవాలుగా కిడ్నీలకు ప్రాధాన్యత ఉంది. అలాంటిది కొందరిలో చిన్న వయసులోనే కిడ్నీలు ఫెయిలై నరకయాతన పడుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇలా మూత్రపిండాలు విఫలమై చికిత్స పొందుతున్న బాధితుల సంఖ్య ఏటికేటికీ పెరుగుతోంది. 40 ఏళ్ల వయసుకే కిడ్నీలు దెబ్బతిని డయాలసిస్ చేయించుకుంటున్న వారు కూడా చాలామంది ఉన్నారు.

ఆహార నియమాలు పాటించకపోవడమే

తిన్న ఆహారాన్ని శుద్ధి చేసి వ్యర్థాలను మలం ద్వారా పంపించడంలో కిడ్నీ ప్రాధాన్యత ఊహించలేం. అలాంటి కిడ్నీలపై భారం మోపి అతలాకుతలం చేస్తున్నారు. మటన్, బీఫ్, ఫాస్ట్‌ఫుడ్, శీతలపానీయాలు, బటర్, చక్కెర, ఉప్పు వంటివి అధిక మోతాదులో తీసుకుని కిడ్నీల మీద లేనిపోని భారం మోపుతున్నారు. మద్యపానం, ధూమపానం కూడా కిడ్నీలకు ప్రమాదాన్ని తెచ్చిపెడుతున్నాయి.

కొంప ముంచుతున్న పెయిన్ కిల్లర్స్

తలనొప్పి.. కాలు నొప్పి, కంటినొప్పి, పంటి నొప్పి ఇలా నొప్పి ఏదైనా పెయిన్ కిల్లర్స్ వేసుకోవడం వల్ల కిడ్నీలపై మోయలేని భారం పడుతోంది. పెయిన్‌కిల్లర్స్ తాత్కాలిక ఉపశమనం ఇవ్వొచ్చుగానీ, దీర్ఘకాలిక ప్రమాదం కొనితెస్తున్నాయి. ఆర్ఎంపీలు, కొంతమంది అల్లోపతి డాక్టర్లూ పెయిన్‌కిల్లర్స్ విచ్చలవిడిగా రాస్తున్నారు.

ప్రమాదానికి సంకేతాలివే...

- ఆకలి సరిగా లేకపోవడం.. తినాలని అనిపించకపోవడం
- నీళ్లు తాగినా మూత్రం సరిగా రాకపోవడం
- ఎలాంటి శారీరక శ్రమ చేయకపోయినా అలసట, నీరసం ఉండటం
- ముఖం లేదా శరీరంలో వాపు లేదా ఉబ్బరం కనిపించడం
- వికారం, వాంతులు వంటివి తరచూ ఉండటం

కిడ్నీ మార్పిడి అంత సులువు కాదు

కిడ్నీలు పనిచేయకపోతే డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. అంటే రక్తమార్పిడి. ఇది ఎన్నో ఏళ్లు కుదరదు. కిడ్నీ మార్పిడి చేయాల్సి ఉంటుంది. కిడ్నీ మార్పిడి అంటే సులువైన ప్రక్రియ కాదు. తాజాగా మన రాష్ట్రంలో దాతల కొరత విపరీతంగా ఉంది. జీవన్‌దాన్ ట్రస్ట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దాతల సంఖ్యను బట్టి ఇస్తారు. దీనికోసం ఐదారేళ్లనుంచి వేచి చూస్తున్న వారూ ఉన్నారు. అందుకే కిడ్నీని ఇబ్బంది పెట్టకుండా కాపాడుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

అనంతపురం జిల్లాలో పెన్షన్ తీసుకుంటున్న కిడ్నీ బాధితులు		
కేటగిరీ	సంఖ్య	పెన్షన్ మొత్తం (నెలకు)
క్రానిక్ కిడ్నీ బాధితులు	4	రూ.20,000
సీరం క్రియాటిర ఎక్కువగా ఉన్నవారు	13	రూ.65,000
స్మాల్ కాంట్రాక్టెడ్ కిడ్నీ బాధితులు	11	రూ.55,000
కిడ్నీ, లివర్ ట్రాన్స్‌ప్లాంట్ బాధితులు	82	రూ.4,10,000

శ్రీసత్యసాయి జిల్లాలో పెన్షన్ తీసుకుంటున్న కిడ్నీ బాధితులు		
కేటగిరీ	సంఖ్య	పెన్షన్ మొత్తం (నెలకు)
క్రానిక్ కిడ్నీ బాధితులు	2	రూ.10,000
సీరం క్రియాటిర ఎక్కువగా ఉన్నవారు	1	రూ.5,000
స్మాల్ కాంట్రాక్టెడ్ కిడ్నీ బాధితులు	3	రూ.15,000
కిడ్నీ, లివర్ ట్రాన్స్‌ప్లాంట్ బాధితులు	87	రూ.4,35,000

నియంత్రణలో ఉంచుకోండి



రక్తపోటు, చక్కెర స్థాయిలు.. ఈ రెండూ అదుపులో ఉంచుకుంటే కిడ్నీలను కాపాడుకోవచ్చు. రోజూ వ్యాయామం చేస్తూ, మితాహారం తినడం వల్ల కిడ్నీలు ఆరోగ్యంగా పనిచేస్తాయి. శీతల పానీయాలకు వీలైనంత దూరంగా ఉండాలి. అన్నిటికీ మించి చీటికీమాటికీ నొప్పినివారిణి మాత్రలు వాడకుండా ఉంటే మంచిది. – డాక్టర్ బదరీనాథ్, మూత్రపిండాల వైద్య నిపుణుడు

నులి పురుగుల నివారణకు చర్యలు తీసుకోండి

అనంతపురం సప్తగిరి సర్కిల్: నులి పురుగుల నివారణకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి, జిల్లా అధికారి డాక్టర్ నారాయణస్వామి ఆదేశించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా స్థాయి అధికారులతో బుధవారం వారు వర్చువల్ విధానంలో మాట్లాడారు. ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు ఉన్న వారందరికీ ఈ నెల 14న అల్బెండెజాల్ మాత్రలను ఉచితంగా అందజేయాలన్నారు. ఇందుకు సంబంధించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ఈ నెల 10 నుంచి గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 6.60 లక్షల మంది పిల్లలను గుర్తించడం జరిగిందని, వీరందరికీ నులిపురుగుల నివారణ గుళికలను అందజేయాలని సూచించారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన



ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్

గోరంట్ల: రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ బుధవారం గోరంట్ల మండలం కరావులపల్లి తండా, రాగుమాకులపల్లి గ్రామాల్లో పర్యటించారు. రూ. కోటి వ్యయంతో తండాలో నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి ఆలయ పనులు పరిశీలించారు. గ్రామంలో టీటీడీ కల్యాణమంటపం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా తండా వాసులు కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం రాగిమాకులపల్లి గ్రామంలో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణ పనులతో పాటు, మరో రూ.50 లక్షలతో నిర్మిస్తున్న గంగమ్మ దేవాలయ పనులను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా దేవదాయ శాఖ అధికారులు, తహసీల్దార్ రంగానాయకులు ఉన్నారు.

ఆ నాలుగు గోపురాలూ ప్రత్యేకమే



కదిరి: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఏర్పాటు చేసిన నాలుగు ప్రధాన గోపురాలకూ చాలా ప్రత్యేకత ఉంది. తూర్పు రాజగోపురాన్ని విజయనగర రాజుల కాలంలో హరిహర రాయలు, పడమర గోపురాన్ని క్రీ.శ 1469లో ఖాద్రీశుడు భక్తురాలు సానవుల చిన్నమ్మ నిర్మించినట్లు ఆలయ చరిత్ర చెబుతోంది. తర్వాత కొన్నేళ్లకు ఈ గోపురం పిడుగు పాటుకు గురి కావడంతో పూర్తిగా శిథిలమైపోయింది. మళ్లీ దీనిని పునర్నిర్మించారు. క్రీ. శ 1386లో కొక్కంటి పాలేగారు వీరమల్లప్ప నాయుడు కుటుంబీకులు నిర్మించిన దక్షిణ గోపురం సైతం 2008లో పిడుగుపాటుకు గురైంది. చిన్నపాటి మరమ్మతులతో ఈ గోపురాన్ని అభివృద్ధి చేశారు. ఉత్తర రాజగోపురాన్ని ముస్లిం పాలకులు నిర్మించారు. ఏటా ముక్కోటి ఏకాదశి నాడు మాత్రమే ఈ గోపురం తలుపులు తెరుచుకుంటాయి. చారిత్రక నేపథ్యం కలిగిన ఈ గోపురాలు పిడుగుపాటుకు గురికాకుండా లైట్నింగ్ కండక్టర్లను అమర్చారు.

కండక్టర్‌కు నగదు అవార్డు



గోపీనాథరెడ్డి చేతుల మీదుగా రివార్డు అందుకుంటున్న లక్ష్మీనరసమ్మ

కదిరి అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ డిపో కండక్టర్ లక్ష్మీనరసమ్మను ఆ సంస్థ కడప జోన్ ఈడీ గోపీనాథరెడ్డి రివార్డు అందజేసి, సత్కరించారు. జోన్ పరిధిలోని 53 డిపోల్లో కదిరి డిపో కండెక్టర్‌కు మాత్రమే రివార్డు దక్కడంపై ఎన్ఎంయూ నాయకులు హరిమోహన్, ఎస్వీ రమణ, బైరిశెట్టి తదితరులు హర్షం వ్యక్తం చేశారు. 2022లో ఆర్టీసీకి అత్యధిక ఆదాయం సమకూర్చినందుకు ఆమెకు రివార్డు దక్కినట్లు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



హనుమంతరాయప్ప మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ నాగేంద్ర

మడకశిర రూరల్: మండలంలోని కల్లుమర్రి గ్రామానికి చెందిన బోయ హనుమంతరాయప్ప (60) బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తెల్లవారుజామున ఇంటి ఎదుట ఆవరణలో ఆయన మృతదేహాన్ని కుటుంబసభ్యులు గుర్తించారు. సమాచారం అందుకున్న సీఐ సురేష్‌బాబు, ఎస్ఐ నాగేంద్ర అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతికి గల కారణాలపై ఆరా తీశారు. కుటుంబ కలహాలే కారణంగా ప్రాథమిక దర్యాప్తులో వెలుగు చూసింది. బాధిత కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ సురేష్‌బాబు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గోరంట్ల: మండలంలోని కోరేవాండ్లపల్లి సమీపంలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను గోరంట్ల సీఐ సుబ్బరాయుడు వెల్లడించారు. జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ నుంచి అందిన సమాచారం మేరకు బుధవారం కోరేవాండ్లపల్లి క్రాస్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన ఓమినీ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 60 బాక్సుల్లో 5,760 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం బయటపడింది. వీటి విలువ సుమారు రూ.30 వేలు ఉంటుంది. మద్యం తరలిస్తూ పట్టుబడిన కర్ణాటకలోని బాగేపల్లి తాలూకా బండొళ్లపల్లి నివాసి మురళీకృష్ణని అరెస్ట్ చేసి, వాహనాన్ని సీజ్ చేశారు. విచారణలో ఓడీసీ మండలం కొండకమర్ల గ్రామానికి మద్యం తరలిస్తున్నట్లుగా అంగీకరించాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఘర్షణ కేసులో ఐదుగురిపై కేసు నమోదు

రాయదుర్గం రూరల్: హోలీ సందర్భంగా చోటు చేసుకున్న ఘర్షణలో ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రాయదుర్గం అర్బన్ ఎస్ఐ సుమన్ తెలిపిన మేరకు... రాయదుర్గం మండలం మల్లాపురం తండాలో మంగళవారం రాత్రి హోలీ వేడుకను అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తండాకు చెందిన సురేష్ నాయక్‌పై స్థానికులు లక్ష్యానాయక్, నాగేంద్రనాయక్, కృష్ణానాయక్, ఈశ్వర నాయక్, బాలకృష్ణానాయక్, విజయానాయక్ మూకుమ్మడిగా దాడి చేశారు. ఘటనలో సురేష్ తలకు, కాళ్లూచేతులకు రక్తగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి చేర్చారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుడి సోదరుడు సేవ్యానాయక్ ఫిర్యాదు మేరకు దాడికి బాధ్యులైన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

చెట్టు మీద నుంచి పడి వ్యక్తి మృతి

తలుపుల: చెట్టు మీద నుంచి కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... తలుపుల మండలం పల్లవాండ్లపల్లికి చెందిన సుధాకర్ (48)కు భార్య పద్మావతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. దినకూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. బుధవారం ఉబ్బరవాండ్లపల్లి సమీపంలో మర్రిమాను కోసేందుకు కూలీగా వెళ్లాడు. చెట్టు ఎక్కి మాను కోస్తుండగా అదుపు తప్పి కిందపడడంతో కాలు విరిగింది. స్థానికులు వెంటనే కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సుధాకర్ మృతి చెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఎస్కేయూ అధ్యాపకురాలికి ఫార్మా అన్వేషణ్ అవార్డు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ కళాశాల సీనియర్ అధ్యాపకురాలు డాక్టర్ కె.వరలక్ష్మీదేవి... ఫార్మా అన్వేషణ్ అవార్డును అందుకున్నారు. ఆల్ ఇండియా ఫార్మా టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7న విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ఫోరమ్ నిర్వహించిన వేడుకల్లో ఈ అవార్డును ఆమె అందుకున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఫార్మసీ అధ్యాపకులకు కొత్త ఆవిష్కరణలకు సంబంధించిన అంశాలపై పోటీ నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులతో నిర్వాహకులు సత్కరించారు. అవార్డు దక్కించుకున్న వరలక్ష్మీదేవిని ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, రెక్టార్ ఎ.మల్లికార్జునరెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోమశేఖర్ అభినందించారు.

హోలీ సంబరాల్లో అపశ్రుతి



అఖింత్‌ఖేర్ (ఫైల్)

గుంతకల్లు: హోలీ సంబరాల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. గుంతకల్లుకు చెందిన సీనియర్ అసిస్టెంట్ లోకోపైలట్ అఖింత్‌ఖేర్ (28) హంద్రీనీవా కెనాల్‌లో గల్లంతయ్యాడు. బుధవారం ఉదయం తన ముగ్గురు స్నేహితులతో కలసి హోలీ సంబరాల్లో పాల్గొన్న అఖింత్‌ఖేర్ .. అనంతరం పడమటి గుంతకల్లు రైల్వేస్టేషన్ సమీపంలోని హంద్రీనీవా కాలవలో స్నానం చేసేందుకు వెళ్లారు. కాలవలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ప్రమాదవశాత్తు కాలు జారి అఖింత్‌ఖేర్ గల్లంతయ్యాడు. ఈత రాకపోవడంతో స్నేహితులు నీటిలో దిగేందుకు సాహసించలేదు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని, స్థానికుల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. రంగంలో అగ్నిమాపక సిబ్బంది దిగింది. రాత్రి వరకూ గాలించినా అచూకీ లభ్యం కాలేదు.

నేత్రపర్వంగా ప్రభ ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న కాటికోటేశ్వర స్వామి మూలవిరాట్

బత్తలపల్లి: మండలంలోని సంజీవపురం సమీపంలో వెలసిన కాటికోటేశ్వర బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. బుధవారం రాత్రి లంకాదహనం కార్యక్రమాన్ని పండు వెన్నెల్లో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. రాత్రి స్వామి ప్రభను ఊరేగించారు. పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి సందడి చేశారు. ఈ వేడుకను చూసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు జనసంద్రమయ్యాయి. సంజీవపురం, లింగారెడ్డిపల్లి, యర్రాయపల్లి, ముష్టూరు, వెంకటగారిపల్లి, అనంతసాగరం గ్రామాలకు చెందిన పలువురు భక్తులు క్షేత్రానికి ప్రత్యేకంగా ఎద్దుల బండ్లను అలంకరించుకుని వచ్చారు. క్షేత్రంలోని మహంకాళీమాత ఆలయంలో గోపూజను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ సుధాకరరెడ్డి, ఎంపీపీ గజ్జల వెంగళరెడ్డి, సర్పంచులు చెడిపోతుల గోపాల్, కమతం వరలక్ష్మి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నరసింహారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు రేణుక, సీపీఐ నాయకులు కమతం కాటమయ్య, మాజీ ఎంపీపీ గుర్రం వనజ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర రైతు విభాగం నాయకులు కమతం ఈశ్వరయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ముస్తాబు చేసిన కాటికోటేశ్వరుని ప్రభ